క్లుప్తంగా

త్వరలో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

రాజోళి: త్వరలోనే జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ గోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది మండలంలో రైతుల నుంచి జొన్నలను కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ ఏడాది కూడా రైతుల విజ్ఞప్తి మేరకు కేంద్రం ఆవశ్యకతనుపై అధికారులకు తెలపడంతో వారు మండలంలో పర్యటించి జొన్న విస్తీర్ణం తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులు పండించిన జొన్నలను కొనుగోలు చేసేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

గట్టు: బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ ధనుంజయ్, ఎంఆర్ఐ శ్రీనివాసులను సోమవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. తహసీల్దార్‌గా పని చేస్తున్న ధనుంజయ్, ఎంఆర్ఐ శ్రీనివాసులు కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. వారిని డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ తిరుమలేష్, గణాంక అధికారి శ్రీనివాసులు, ఆర్ఐ కరీ, సర్వేయర్ నర్సింహులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

అయిజ: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం పనిచేసిన షాహిదా బేగం ఇటీవల బదిలీ కావడంతో ఆమె స్థానంలో వడ్డేపల్లి తహసీల్దార్‌గా పనిచేసిన జ్యోతి ఇక్కడికి వచ్చారు. నిబంధనల మేరకు విధులు నిర్వర్తిస్తానని, రెవెన్యూకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆమె తెలిపారు.

అయోధ్యకు తరలిన భక్తులు



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు రామ భక్తులు బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో సోమవారం అయోధ్యకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వేముల, కోదండాపురం, ధర్మవరం, ఎర్రవల్లి గ్రామాల బిజేపీ నాయకులు, కార్యకర్తలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైలు ద్వారా అయోధ్యకు బయలుదేరారు.

శాంతినగర్: అయోధ్యలోని బాలరాముని దర్శనానికి వడ్డేపల్లి మున్సిపలిటీ, మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు బయల్దేరి వెళ్లారు. అయోధ్యకు బయల్దేరి వెళ్లిన వారిలో వెంకటేశ్వర్లు, మద్దిలేటి, రాముడు, శివ, రాజనరసింహ, మహేష్, పరశురాముడు, నాగరాజు, మల్లి, పరుష, వెంకటయ్య, కృష్ణ, వెంకటేష్, బి, రాముడు, ద్యావర్ల పరుషలు వున్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బోయ పరశురాముడు తన అశోక్ లేలాండ్ వాహనంలో చేపల చెరువుల కోసం చికెన్ వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి యక్తాపురం స్టేజీలో పోలీసులు వాహనాల తనిఖీ చేసి చికెన్ వ్యర్థాల వాహనాన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చేపట్టనున్న మరమ్మతులో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ గోవిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 33/11 కేవీ ఉత్తనూరు సబ్‌స్టేషన్‌కు మరమ్మతులు చేపట్టనుండడంతో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మండలంలోని ఉత్తనూరు, సంకాపురం, ఈడిగోనిపల్లి, భూంపురం గ్రామాల కు విద్యుత్ సౌకర్యం నిలిపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొత్త సారు వచ్చినా.. పాత సారే బాధ్యతల్లో..

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి నాగర్ కర్నూల్ జిల్లా నుంచి బదిలీపై సలీమోద్దీన్ ఉండవెల్లికి వచ్చారు. వచ్చిన తర్వాత బాధ్యతలు అప్పగించాల్సి ఉండగా, సోమవారం పాత తహసీల్దార్ 8 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యే వరకు బాధ్యతలు అప్పగించలేదు. ఆ పని ముగిసే దాకా వచ్చిన తహసీల్దార్ పడిగాపులు కాయాల్సి వచ్చింది. సాయంత్రం వచ్చిన తహసీల్దార్‌కు బాధ్యతలు అప్పగించారు. పాత తహసీల్దార్ ధరూర్ మండలానికి బదిలీ అయ్యారు.

ఘనంగా శివాజీ శోభాయాత్ర

- ఛత్రపతి శివాజీకి ఘనంగా నివాళి
- ఆయా గ్రామాల్లో విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు
- శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలని హితవు
- పలు చోట్ల ర్యాలీలు, సభలు



గద్వాలలో ఛత్రపతి శివాజీ శోభాయాత్రలో పాల్గొన్న హిందూ ధార్మిక సంఘాల నాయకులు

గద్వాల: ఛత్రపతి శివాజీ మహరాజ్ దేశానికే గర్వకారణమని వివిధ హిందూ ధార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, శంభూనాథ్‌మఠం యూత్, బీజేపీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శంభూనాథ మఠంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌లతో పాటు బీజేపీ నాయకులు, హిందూ ధార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు.

ఛత్రపతి శివాజీ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రధాన రహదారుల వెంట యాత్ర సాగింది. శోభయాత్ర మార్గమధ్యలో పలువురు నాయకులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ నాయకులు ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఫణిమోహన్‌రావు, ధర్మప్రసార సమితి జిల్లా కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, భజరంగ్‌దళ్ నేతలు, శంభూనాథ్ మఠం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలే స్ఫూర్తి

అలంపూర్: మహనీయుల జీవిత చరిత్రల ద్వారా విద్యార్థులు స్ఫూర్తి పొందాలని ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్లో సమ సమాజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ 394వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి ట్రస్టు సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హరిజనవాడ జెడ్పీహెచ్ఎస్, బాలికల జెడ్పీహెచ్ఎస్, బాలుర జెడ్పీహెచ్ఎస్, న్యూ ప్లాట్స్ జెడ్పీహెచ్ఎస్, గురుదేవ్, శారద హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న 141 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, స్కేళ్లను పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ యువత సమాజసేవ అలవర్చుకోవాలన్నారు. శివాజీ మత సామరస్యాన్ని కోరుకున్నారని, ఇతర మతాలను గౌరవించారన్నారు. ఆయన సైన్యంలో కులాలకు అతీతంగా సైనికులుగా పనిచేశారన్నారు. విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి పేరుతెచ్చుకోవాలన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారుడు పాటలు పాడి అందరిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాసులు, ట్రస్టు ప్రధాన కార్యదర్శి నాగరాజు, డైరెక్టర్లు వెంకట్రామయ్య శెట్టి ఉన్నారు.



శివాజీ శోభయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నాయకులు

రాజోళి: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక అడివేశ్వర స్వామి ఆలయంలో జై శ్రీరామ్ సేవా సమితి ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎస్ఐ జగదీశ్వర్‌తో పాటు 49 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, మాజీ ఉప సర్పంచ్ గోపాల్, మాజీ ఎంపీటీసీ గంగి రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ధరూరు: మండలంలోని ఉప్పేరులో శివాజీ మహారాజ్ విగ్రహాన్ని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: చెన్నిపాడులో శివాజీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో గోవర్ధన్, పురుషోత్తం, రాఘు, ఆర్ఎంపీ డాక్టర్ రాము పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో శివాజీ జయంతిని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం ఆవరణలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి యూత్ సభ్యులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మోటారుసైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. చంద్రశేఖర్‌రావు, తిమ్మప్ప పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో ఛత్రపతి శివాజీ జయంతిని ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కటిక సంఘం సభ్యులు స్వీట్లు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో గోప్రచారక్ సమితి అధ్యక్షులు గాయత్రి, జీతూరి రమేష్, లక్మోజీరావు, గోకారి పాల్గొన్నారు.



అలంపూర్‌లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేస్తున్న ఎంఈఓ



రాజోళిలో శివాజీ జయంతి వేడుకలు



మల్దకల్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



చెన్నిపాడులో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



అయిజ: పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల నోడల్ ఆఫీసర్ రాములు దయాళ్ అన్నారు. సోమవారం మండలంలోని యాపదిన్నె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివి పాఠశాల ఉత్తీర్ణత శాతాన్ని పెంచుతూ మండల స్థాయిలో గర్వించదగిన జీపీఏ పాయింట్లు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

అయిజ: 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'అందకారంలో అయిజ' కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని కమతంపేట, గుర్రంతోటతో పాటు వివిధ కాలనీల్లో, ప్రధాన రోడ్ల పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలకు కాలిపోయిన ఎల్ఈడీ బల్బులు తొలగించి వాటిస్థానంలో కొత్త ఎల్ఈడీ బల్బులు అమర్చారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు 'సాక్షి'ని అభినందించారు.

వైభవంగా కల్యాణోత్సవం



నారాయణపురంలో హాజరైన భక్తులు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మానవపాడు: మండలంలోని నారాయణపురంలో సోమవారం బాలయోగి శివనారాయణ స్వామిని స్మరించుకుంటూ ఆశ్రమంలో నిత్య పూజలతో 44వ అఖండ జ్యోతి ప్రారంభమైంది. మాఘశుద్ధ దశమి తేది సోమవారం ఉదయం 8.40 గంటలకు శివనారాయణస్వామి పాదకులు దివ్య సమాధి దర్శనం చేశారు. అనంతరం ఉదయం 11.55 గంటలకు రమాసహిత సత్యనారాయణ స్వామి వారి కల్యాణం నిర్వహించారు. పగిడి వీరారెడ్డి, కేమిరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, లింగేశ్వర్, గొల్ల వెంకట్రాములు, రామోహన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం అంగరంగవైభంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతర, కల్యాణోత్సవాలను తిలకించారు. జాతర ఉత్సవాలకు ఇతర రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి జోగుళాంబ గద్వాల, కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని వివిధ మండలాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కృత్యాధార పద్ధతిలో బోధన సులభం

మల్దకల్: కృత్యాధార పద్ధతిలో విద్యార్థులకు విద్యా బోధన చేయడం ద్వారా విద్యార్థులు సులభంగా నేర్చుకొని, ఎక్కువ కాలం గుర్తుంచుకుంటారని ఇన్‌చార్జి ఎంఈఓ కొండారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాగర్‌దొడ్డి, చిప్పదొడ్డి, శేషంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్యాధార పద్ధతిలో విద్యాబోధన చేయడం వల్ల విద్యార్థులు ఒకేసారి వినడం, చూడడం జరుగుతుందన్నారు. ఆయా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చింతరేవులలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ధరూరు: పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్వ నవమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారి రథం వద్ద శివ స్వాములు, సాధారణ భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు చేశారు. వారం రోజులుగా బ్రహ్మోత్సవాలు నేటితో ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, ఆలయ ప్రధాన అర్చకులు చక్రపాణి జోషి, ఈఓ కవిత పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

కేటీదొడ్డి: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడల్లో ప్రతిభ చూపితే జాతీయ స్థాయి వరకు అవకాశం లభిస్తుందని, క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని ఎస్ఐ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని గువ్వలదిన్నెలో నిర్వహిస్తున్న మాళమ్మ, మారెమ్మ జాతర సందర్భంగా గ్రామంలో కబడ్డీ పోటీలను ఎస్ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి పోటీలు నిర్వహిస్తే ఎందరో క్రీడాకారులు బయటకు వస్తారని తెలిపారు. ప్రభుత్వం క్రీడారంగానికి ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సిబ్బంది చేతివాటం

రాజోళి: ప్రాథమిక సహకారం సంఘం అధికారులు రైతుల నుంచి అధికంగా డబ్బు వసూలు చేస్తున్నారని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. వడ్డేపల్లి ప్రాథమిక సహకారం సంఘం ద్వారా రాజోళి, వడ్డేపల్లి మండలాల్లో రైతులు గతంలో రుణాలు తీసుకున్నారు. వాటిని రెన్యువల్ చేపట్టిన అధికారులు గ్రామాల్లో రైతులను కలుస్తున్నారు. రైతులు కట్టాల్సిన సొమ్ముతో పాటు, అవకాశాన్ని బట్టి రూ.500 నుంచి రూ.1000 దాకా అదనంగా వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఎక్కువ డబ్బులు ఎందుకు అని అడిగితే ఆర్ఓఆర్, పహాణికి అని చెబుతున్నారని తెలిపారు. ఆర్ఓఆర్, పహాణి తీసుకొచ్చిన వారి దగ్గర కూడా ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయమై సంబంధిత సీఈఓ రవి కుమార్‌ను సంప్రదించగా ఎక్కడా అధికంగా డబ్బు వసూలు చేయడం లేదని, ఆర్ఓఆర్, పహాణి తీసుకురాని వారితో డబ్బు తీసుకున్నట్లు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ ఈ విషయంపై స్పందిస్తూ, రైతుల వద్ద సిబ్బంది చేతివాటం చూపిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురా వాలని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్సు, లారీ ఢీ : ఒకరికి గాయలు

మానవపాడు: జాతీయ రహదారి 44 జల్లాపురం శివారు ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున బస్సును లారీ ఢీ కొట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన చోటు చేసుకుంది. పెట్రోలింగ్ సిబ్బంది కథనం మేరకు.. జాతీయ రహదారి 44పై ప్రైవేట్ బస్సు బెంగుళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తోంది. తమిళనాడు నుంచి కర్నూల్ మీదు గా హైదరాబాద్ వైపు లారీ వెళ్తోంది. ఈ క్రమంలో ముందు వెళ్తున్న బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనకవస్తున్న లారీ బస్సును ఢీ కొట్టింది. లారీ డ్రైవర్ సతివేలుకు తీవ్ర గాయాలు కావడంతో చికి త్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించా రు. ఈ సంఘటనపై ఎస్ఐ చంద్రకాంత్ ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు

కేటీదొడ్డి: మండలంలోని శ్రీరంగాపురం నుంచి పాతపాలెం వైపు సోమవారం అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. మట్టి విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదని మండల ప్రజలు పేర్కొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



సేవాలాల్ జయంతిని సందర్భంగా పూజలో పాల్గొన్న గిరిజనులు

కేటీదొడ్డి: సంత్ సేవాలాల్ మహరాజ్ ఆచరణలో ప్రతి ఒక్కరూ నడవాలని సేవాలాల్ కమిటీ సభ్యుడు వీరేష్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని తూర్పుతండా, వాగుతండా పూజారితండాలో బంజారా సంప్రదాయం ప్రకారం బోగు పూజా చేసి సేవాలాల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ గిరిజనులకే కాకుండా అందరికీ ఆరాధ్యులని అన్నారు. కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తి శ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి శివునికి మొక్కులను తీర్చుకున్నారు.

జేసీబీలు, ట్రాక్టర్ల పట్టివేత

గట్టు: ఎలాంటి అనుమతి లేకుండా మండల కేంద్రంలో మట్టిని తరలిస్తున 2 జేసీబీలు, 2 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. తప్పెట్లమొర్సుకు చెందిన జేసీబీలు, ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వాహనాల వివరాలను మైనింగ్ అధికారులకు అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక సాయం

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాలకు చెందిన శివమాల ధరించిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసేందుకు బీఆర్ఎస్ నాయకుడు రాముడు రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు.

ప్రత్యేక పాలనకు అడ్డంకులు

- ప్రత్యేకాధికారులు బదిలీ
- గ్రామాల్లో అభివృద్ధిపై ప్రభావం
- మరికొందరికి అదనపు బాధ్యతలతో ఇరకాటం

రాజోళి: సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. ఆయా గ్రామాల వారీగా ప్రత్యేకాధికారిని కేటాయించి, సర్పంచ్ లేని లోటు కనిపించకుండా గ్రామాల్లో అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం గ్రామాల్లో కేటాయించిన ప్రత్యేకాధికారులే పాలన చేపడుతుండగా, వారికి గ్రామాల్లో ఉన్న సమస్యలపై అవగాహన కూడా రాలేదు. ఈ క్రమంలో బదిలీల ప్రక్రియ మొదలుకావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఉన్న అధికారులకు తమ సమస్యలు చెప్పి పాలనకు సిద్ధం చేసుకునేలోగా, వారు బదిలీ కావడం, వారి స్థానంలో వచ్చే కొత్త అధికారులు విధుల్లో ఎప్పుడు చేరతారు? వారు గ్రామాలను ఎప్పుడు పరిశీలిస్తారు. సమస్యలు పరిష్కారానికి ఇంకా సమయం పట్టనుంది.

మొదలైన ప్రత్యేక పాలన

ఈనెల 1వ తేదీ నుంచే గ్రామాల్లో సర్పంచుల పాలన ముగిసి, పాలన మొత్తం ప్రత్యేకాధికారుల చేతిలోకి వె ళ్లింది. మండలాల్లోని గ్రామాల సంఖ్యను, జనాభా దృష్ట్యా అధికారులకు కేటాయించారు. తహసీల్దార్, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్, వెటర్నరీ డాక్టర్‌లతో పాటు గెజిటెడ్ హోదా ఉన్న అధికారులకు ప్రత్యేక పాలన అప్పగించారు. పాలన మొదలై 15 రోజులు ముగుస్తున్న క్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓలు, బదిలీల ప్రక్రియ మొదలు కావడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. రాజకీయాల కారణంగా సర్పంచ్‌ల కాలంలో సమస్యల పరిష్కారానికి ఇబ్బందులు తలెత్తాయి. పథకాల అమల్లో వివక్షలు చూపడం, రాజకీయ ఒత్తిళ్లు కారణంగా అభివృద్ధి పనులు నిలిచాయనే ఆరోపణలున్నాయి. ఈ సమయంలో సర్పంచుల పదవీ కాలం ముగియడం, అధికారుల చేతిలోకి పాలన వెళ్లడంతో రాజకీయ కారణాలకు తావు లేకుండా తమ పనులు సాగుతాయని అనుకు న్న సమయంలో బదిలీల ప్రక్రియ అడ్డుకట్ట వేసినట్లైంది. రాజోళి మండలంలో ఎంపీడీఓ బదిలీపై వెళ్లగా, నారాయణ పేట నుంచి రాజోళికి నూతనంగా ఎంపీడీఓ వచ్చారు. తాజాగా ఇక్కడ విధులు ని ర్వహిస్తున్న తహసీల్దార్ వడ్డేపల్లికి బదిలీ అయ్యారు. వడ్డేపలి, మల్దకల్ మండలాల తహసీల్దార్‌లు కూడా బదిలీ అయ్యారు. ఇలా పలు మండలాల్లో జరుగుతున్న బదిలీల ప్రక్రియ ప్రత్యేక పాలనపై ప్రభావం చూపేలా ఉంది. రానున్నది వేసవి కాలం, నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవడం, ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవడం వంటి కార్యక్రమాలు ఉన్న సమయంలో గతంలో ఉన్న అధికారులకైతే గ్రామాలపై పూర్తి అవగాహన ఉండేది, కొత్తగా వచ్చిన వారు మళ్లీ గ్రామాల్లో తిరిగి, వాటిపై పూర్తి పట్టు తెచ్చుకుని చర్యలు చేపట్టే సమయానికి వేసవి రానే వస్తుంది. నీటి సమస్యతో పాటు, ప్రభుత్వ స్థలాల తగాదాలు, భూ తగాదాలు కొన్ని చివరి దశకు వచ్చాయని, ఈ క్రమంలో అధికారుల మార్పిడితో వాటి పరిష్కారంలో జాప్యం జరిగే అవకాశముంది. ఇప్పటికే మండలాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద సీసీ రోడ్ల పనులకు కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. పలు చోట్ల పనులు కూడా మొదలవుతున్నాయి.


అదనపు బాధ్యతలు..

కేటాయించిన ప్రత్యేకాధికారులకు సాధారణంగా తమ విధులతో పాటు, ప్రత్యేక అధికారి బాధ్యతలు ఉన్నాయి. ఇందులోనే చాలా చోట్ల అధికారులకు ఇతర మండలాల ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. కొత్తగా వచ్చిన అధికారులకు కూడా ఇలా అదనపు బాధ్యతలు కేటాయించడంతో, వారు రెగ్యులర్ డ్యూటీ చేసే మండలంలో ప్రత్యేకాధికారిగా ఉండాలా? ఇన్‌చార్జిగా ఉన్న చోట ఉండాలా అనే సంశయంలో ఉన్నారు. జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు కూడా రావాల్సి ఉండటంతో అప్పటి దాకా వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదేశాలు వచ్చే వరకు ఎదురుచూడాలంటే, గ్రామాల్లో పాలన కుంటు పడుతుంది. వాటిని దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు బదిలీలపై వచ్చిన వారికి గ్రామాల్లో అందుబాటులో ఉండేలా, వేగంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రాజోళిలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రామసభ (ఫైల్)


ఆలస్యం చేయకూడదు..



అసలే రానున్నది వేసవి కాలం, నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు వారు ఇప్పటి నుండే ప్రణాళిక రూపొందించుకోవాల్సి ఉంటుంది. కాబట్టి ప్రత్యేక పాలనలో ఉన్న అధికారుల అందాల్సిన ఆదేశాలు త్వరగా అందచేయాలి.

– నిషాక్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు, గద్వాల

ఆదేశాల కోసం చూస్తున్నాం



నేను రాజోళికి బదిలీపై వచ్చాను. నాకు రాజోళి మండలంతో పాటు, వడ్డేపల్లి మండలం కూడా ఇన్‌చార్జిగా ఉంది. అయితే ప్రత్యేకాధికారిగా ఏ గ్రామాల్లో కొనసాగాలనే విషయాన్ని జిల్లా అధికారులు నిర్ణయించాల్సి ఉంది. వారి ఆదేశాలు అందగానే ఆ గ్రామాలకు ప్రత్యేక అధికారిగా వెళతాం.

– రమేష్ కుమార్, ఎంపీడీఓ రాజోళి